చిన్నకథ



# ఇన్ షర్టో పాఖ్యానం

టి.చంద్రశేఖరరెడ్డి

నా చిన్నప్పుడు మా ఊరి మొత్తం మీద ఇన్ షర్టు వేసుకునే వ్యక్తు ముగ్గురే వుండేవాళ్లు. నా చిన్నప్పుడు అంటే 40సంవత్సరాల క్రితం. మా ఊరంటే ఊరి జన్నాభా సుమారు ఐదువేలు. ఈ నలభై సంవత్సరాలలో మా ఊరు చాలా ప్రగతి సాధించింది. జనాభా పదివేలు అయింది. ఇన్ షర్టు వేసుకునే వాళ్లు మూడు వేల మంది అయ్యారు. నిష్పత్తి మా ఊళ్లోనే కాదు... చాలా చోట్ల ధాబుణంగా మారింది.

ఒకప్పుడు ఇన్‌షర్టు స్టేటస్ సింబల్. ఇప్పుడో సింబాలిక్ స్టేటస్. అందుకే ఇండియాలో లా చదివి కెనడాలో బ్రతుకు తెరువు వెతుక్కున మా కజినం టాడు ''అన్నయ్యా! ఇంగ్లీషుకూ, ఇన్ షర్టుకూ విలువ లేకుండా చేస్తున్నారు'' అని. నేనన్నా- నిజమేరా అని. రెండు అరువు తెచ్చుకున్న సంస్కృతులేగా! ఆ సంగతి అలా వుంచితే ఇన్ షర్టు గురించి నాలుగు ఇంట్రెస్టింగ్ ముచ్చట్లు చెప్పు కుందాం.

ఇన్ షర్టుని టక్ చేసుకోవడం అని కూడా అంటారని మనకందరికి తెలుసు. కాకపోతే ఇన్ షర్టుని ఇంగ్లీషులో ఎలా రాయాలని నా అనుమానం. షర్టు ఫాంట్ లోపల వుంటుంది గనుక In-Shit అని వ్రాయాలా? షర్టుని ఫాంట్ లోపిలకి నెడతాం కాబట్టి insert అని వ్రాయాలా? అని. విజ్ఞులెవరైనా ఈ డౌటే హాన్ని ఆధారసహితంగా తీరిస్తే బాగుండు!

ఖమ్మంలోని మా కొలీగ్ తాను ఇన్ షర్టు వేసుకోని రోజుల్లో ఇన్ షర్టుల్ని మూడు రకాలు విభజించాడు. హృదయ టక్, నాభి టక్, బిలో టక్ అని. ఫాంట్ వెనుక కిందకి వుండి, ముందు భాగం పైకి వుంటే హదయ టక్. ముందు భాగం వెనుక భాగం సమాన స్థాయిలో వుంటే నాభి టక్, ముందు భాగం కిందకి జారి పోతూ, వెనక భాగం పైన వుంటే బిలో టక్. ఈ మూడింటిలో మధ్యది ఉత్తమం. మొదటిది మధ్యమం. చివరది అధమం అని అతడి అభిప్రాయం. అతడి అభి ప్రాయంతో విభేదించను. కానీ- వేసుకున్నప్పుడు ఎలా వుందో రోజంతా అలా వుంటేనే బాగుంటందనేది నా ఉద్దేశం. కాని మా స్నేహితుడు మరొకతను దీనికి పూర్తి వ్యతిరేకం. అతడి ఇన్ షర్టు అనుక్షణం డార్విన్ సిద్ధాంతానికి లోబడి పరిణామ క్రమానికి లోనవుతుంటుంది. దాని ఫలితంగా ఇంతింతై వటుడింతై అన్నట్లు ఉదయం ఆఫీసుకి వచ్చినప్పుడు ఫాంట్‌లో దాక్కున్న షర్టు మధ్యాహ్నానికి వెనుక వైపు పూర్తిగా బయటకు వస్తుంది. సాయంత్రానికి పూర్తిగా రెండు వైపులా బయటకు వచ్చే కార్యక్రమం దిగ్విజయంగా పూర్తవుతుంది. ఇన్ షర్టు ఇలా అవుట్ షర్టు అవడం అతను గమనిస్తాడడా, గమనించడా లేక గమనించి ప్రేక్షకుల సౌకర్యం కోసం వదిలేస్తాడా అన్నది భేతాళ ప్రశ్న. ఏ విక్రమార్కుడు దీనికి తల వేయి వక్కలు కాని సమాధానం చెప్పగలడు.

అసలు ఇన్ షర్టు ఎందుకు వేసుకుంటారని నా స్నేహితుడొకడూ కొంటెగా క్రొశ్నించాడు. ఒక్కొక్కళ్లకి ఒక్కో కారణం వుంటుందని అతడే ఆన్సరించాడు. వాళ్ల ఫ్రెండు వొకతను కొన్ని షర్టులు వేసుకున్నప్పుడు ఇన్ షర్టు వేసుకొనేవాడనీ, కొన్ని ఫాంట్లు వేసుకున్నప్పుడు మానేసేవాడనీ కొస మెరిపించాడు. ఇంటికొచ్చాక నా భార్య అడిగింది. మీ కళ్లలో ఆ కొత్త కాంతి ఏమిటని. ఇందాక మా స్నేహితుడు చెప్పినదానికి కళ్లు జిగేల్మన్నాయనీ- ఈ కాంతి దాని పర్యవసనామే అనీజవాబు ఇచ్చాను. అనుమానంగా నా వంక చూసుకుంటూ లోపలకి వెళ్లింది. అదృష్టవ శాత్తు ఏ విపత్తు సంభవించలేదు.

ఇన్ షర్టు వేసుకున్నప్పుడు కొందరు బెల్టు తప్పనిసరిగా పెట్టుకుంటారు. కొందరు బెల్టు లేకుండా ఇన్ షర్టు వేసుకుంటారు. దీనికి కూడా ఏదన్నా కారణం వుందా? అని మా సందేహాల్రావుని అడిగాను. బెల్టు పెట్టుకోని వాళ్లు కొందరు దాని స్థానాన్ని మొలత్రాడుతో భర్తీ చేస్తారు. ఎందుకని? అని నాకు ఎదురు ప్రశ్న వేశాడు. ప్రశ్నకు ప్రశ్న సమాధానం అవుతుందా? అని అడుగుదామనుకున్నాను. కానీ, మరో ప్రశ్న ఎదురవుతుందేమోనని మర్యాదగా తప్పుకొన్నాను.

ఫైనల్‌గా నాకో అనుమానం. ఇన్ షర్టు వేసుకున్నప్పుడు తప్పనిసరిగా బూట్లు వేసుకోవాలా? శాండిల్స్ కానీ, చెప్పులు కానీ వేసుకోవచ్చా? అని. మీ స్నేహితుడు స్లిప్పర్లు వేసుకొంటాడా! ఇంకా నయం! ఏవీ వేసుకోడని అనలేదు.

చివరగా ఒక మాట. మనం చేసే పని మనకూ ఎదుటివాళ్లకూ తృప్తి కలిగిస్తే చాలా మంచిది. కనీసం మనికి కాకపోయినా ఎదుటి వాళ్లకి ఆనందం కలిగిస్తే మంచిది. ఎదుటి వాళ్లకి కాకపోయినా, కనీసం మనకు తృప్తి కలిగితే ఫర్లేదు. మనకి ఇబ్బంది అనిపించి ఎదుటి వాళ్లకు కూడా ఇబ్బంది అనిపించేదాన్ని మనం చేస్తే మాత్రం దానికి మాటల్లేవు.

నా చుట్టూ జనం మీద నాకు కసి- అందుకనే నేను ఇన్ షర్టు వేసుకొని వాళ్లను 'చిత్రహింత- కాదు!కాదు! విచిత్ర హింసకు గురిచేస్తానంటారా. నాదో చిన్న సలహా. ఆ పనేదో ఇన్ షర్టు వేసుకుంటే పరమ ఛండాలంగా వుంటే మీ ఫ్రెండ్‌తో చేయించి ఇన్ డైరక్టుగా కసి తీర్చుకోవచ్చుగా? ఆ పని ఆల్రెడి చేసా నంటారా! ఆవ్యక్తిని తప్పనిసరిగా వెతికి పట్టుకుంటాను. ఈ లోపున పొరపాటున ఆ వ్యక్తి ఇంకెవరికైనా కనపడితే నాకు కొంచెం ఫోన్ చేసి చెప్పండి!

ఉంటానేం!!

★